



# ముసుగు మనిషి

రచయిత : నబ్బెళ్ళ గంగాధర రెడ్డి

"ఏరా కుట్టి ఇలా వచ్చావ్?" అన్నారు ఆనందబాబుగారు బిక్కు బిక్కుమంటూ దొడ్లోకి వస్తున్న బుల్లికుట్టితో.

"మా ఎంకన్న కోసమండి" అన్నాడు బుల్లికుట్టి అతివినయంగా.

"ఏం పనిరా యిప్పుడు వాడితో నీకు" అన్నాడు ఆనందబాబు అదేదో తెలుసుకుందామనే ఆపేక్షతో.

"దాన్ని మా అక్క ఎంకన్నబావ కొక్కడికే చెప్పమన్దండి" అన్నాడు అమాయకంగా.

మా అక్క అనేటప్పటికి ఆనందబాబు ఒక్కసారి ఉలిక్కిపడి "ఏమిటి! ఏమిటి! ఎంకి! ఎంకడితోటే చెప్పమందా!! ఏమిట్రా ఆ రహస్యం నాకుకూడా కాస్త చెప్పరా" అన్నాడు కొంచం ఆతృతగా.

"మా అక్క ఎవ్వరికిచెప్పొద్దంది. మీకు చెప్పితే నన్ను చంపేస్తాది" అన్నాడు అమాయకంగా ఆ కుట్టి.

"ఫర్వాలేదు చెప్పరా మీ అక్క చూడ వచ్చిందేమిటి? నీవు నాకు చెప్పిందీ లేన్దీ" అన్నాడు ఆనందబాబు బలవంతంచేస్తూ.

"బాబోయ్ నేను చెప్పనండి! మా అక్క నన్ను కొట్టేస్తాది" అన్నాడు కుట్టి.

"భయంలేదు చెప్పరా! మీ అక్క వాడితో ఏం చెప్పమందో నాకు చెప్పితే నీకు సినిమాకు డబ్బులిస్తాను" అన్నాడు.

సినిమాకు డబ్బులనటంతోటే అతనిలో ఒక ఆశ మొలిసింది. కొత్తసినిమా రావటం దానికి డబ్బులు దొరక్క తంటాలువడటం అన్నీ ఒక్కసారి స్పురణకువచ్చాయి బుల్లికుట్టికి.

"పట్టిదే మీరు డబ్బులూ యివ్వరు! ఏమీ యివ్వరు. అలా అంటారంతే! అది కాస్తా చెప్పేసాక డబ్బులూలేవు గిబ్బులూ లేవు పోరా అంటారు" అన్నాడు బుల్లికుట్టి డబ్బులు అంటే కొంచం లొంగినట్లుగా.

ఆ ఎంకి ఎంకడికేమని చెప్పమన్నదో తెలుసుకోవాలనే కోరికతో పిల్లికి బిచ్చం బెట్టని ఆనందబాబు ఒక పావలాకానుతీసి వాడికిస్తూ "ఇదిగో తీసుకో! ఈసారి చెప్పు మీ అక్క వాడికేమని చెప్పమన్నదో!" అన్నాడు.

ఒక నయా పైసాను రూపాయికానులా చూచుకొని దానికి పదేముళ్ళువేసే ఆబుల్లికుట్టికి పావలాకానును చూచుకొని మురిసిపోయి సంతోషంతో దాన్ని స్వీకరించాడు.

"మరేండి! మాఅక్క ఈరాత్రికి ఎంకన్న బావని చెరువుగట్టుకి రమ్మని చెప్పమందండి" అని చిఱుకంఠంతో చెప్పివేసి "దీన్ని ఎవరికీ చెప్పకండోయ్! మా అక్క నన్ను చంపేస్తాది" అన్నాడు తొమ్మిదేళ్ళ ప్రాయంగల ఆ అమాయకకుర్రాడు.

స్వార్థపిశాచానికి వశుడై నరజన్మ దాల్చిన దానవుడు. ముప్పది ఎకరముల భూపతి ఆనందబాబు.

అయిదారు కుంచముల మన్నుగల పేద రైతులకు ఆపద్బాంధవుడిలా అప్పులిస్తాడు చక్రవడ్డీకి!! ఈ వడ్డీ హిమాలయ పర్వతమంత పెరిగిపోతాది రెండు మూడు సంవత్సరాలకి. దాన్ని తీర్చలేక ఆమన్నుకు కాస్తా తిలాంజలి యిచ్చివేస్తాడా రైతు. ఇది ఒక రకమైన సంపాదన ఆనందబాబుకు.

* * *

ఎంకి చాలా అందకత్తె. నువ్వు పువ్వు నాసికతో, విప్పారిన కలువరేకుల కన్నులతో, వంకీలుతిరిగిన కేశరములతో నాజూకుగా వుంటుంది. పాపం! ఆమె అందాన్ని చూసి మోహించి కాబోలు దరిద్రం ఆమెను వరించింది—ఆమె ఎంకన్ని వరించింది!

ఆనందబాబుకి ఎంకి అందమంతా ఒక్కసారి స్పురణకు వచ్చింది. ఆనాడు తన్ను చాచి లెంపకాయకొట్టింది తోటలో చేయి పట్టుకొన్నాననని. ఇప్పుడు ఎక్కడికి పోతుందో చూస్తాను. ఈరాత్రికి చెప్పుతాను దీనిపని అనుకున్నాడు ఆనందబాబు పళ్లు పటపటమనిపిస్తూ.

వెంటనే ఒక పన్నాగంపన్నేడు. దానితో ఎంకి తనకు చిక్కక తప్పదనుకున్నాడు. ఆనాడే పౌర్ణమి పండువెన్నెల్లో చల్లటి గాలిలో ఎంకి అందాన్ని అపహరిద్దామనుకున్నాడు. పిచ్చికాముకుడు! పచ్చటి ఎంకి శీలం తెలియని పామరుడు! ఎంకి ఇలాంటి పిచ్చివాళ్లకెందరికో తగిన చికిత్సచేసింది.

తలకు పాగ, చేతిలో కర్రపట్టుకొని అప్పుడే వచ్చాడు ఎంకడు. మంచినమ్మిన బంటు. తనజీవితాన్ని యజమాని కంకితం జేసి గుడ్డిగా అతన్ని నమ్మి సేవలుచేస్తున్న ఒక పాలికాపు.

"ఏరా ఎంకా! వెళ్లిన పనయిందా?" అన్నాడు ఆనందబాబు!

"అయ్! అయిపోయిందండి" అన్నాడు.

"అ! అన్నట్లు మరచాను నీ కోసం ఎందుకోబుల్లికుట్టివచ్చాడు కన్పించాడా?"

"అయ్ కన్పించాడండి"

"ఓరేయ్ ఎంకా! శ్రీహనుమాన్‌థియేటర్లో ఏదో సినీమా మారిందని విన్నాను ఏమిట్రా అది?" అన్నాడు ఆనందబాబు.

"నాకు తెలియదండి! ఏదో కొత్తసినిమా వచ్చిందని మాత్రం విన్నాను. చాలా బాగుంటాదటండీ!"

"చాలా బాగుంటుందనే నేను విన్నా. ఈవేళ వెళ్దాం సిద్ధంగావుండు, త్వరగా యింటికిపోయి భోజనంచేసిరా!"

ఈ మాటలకు ఎంకడు చాల అబ్బురపడినాడు. ఎప్పుడూ సినీమాకు దేనికే తీసుకెళ్ళని యజమాని నేడిలా అన్నందులకు చాలా ఆనందించాడు. ఎన్నడూ ఒక్క నయాపైసాకూడ ఖర్చుపెట్టని స్వార్థపరుడు నేడిలా మారినందులకు ఆశ్చర్యపడ్డాడు. కాని, రాత్రికే అతని ప్రియురాలు ఎంకి చెఱువుగట్టుకు విహారానికై పిలిచింది. అటు ప్రియురాలి పిలుపు, ఇటు యజమాని ఆహ్వానం! ఎటువైపుకు మొగ్గాలో అతనికి తోచలేదు. ఎన్నడూ కలలో కూడ ఊహించలేదు తన్ను సినీమాకు తీసుకెళతాడని. ఇప్పుడు నేను రానంటే 'ఏం' అంటాడు. సినిమాకు అడగనిదే తీసుకొనివెళ్తానంటే రానట్టున్న నీ యంతటి తెలివితక్కువ వాడున్నాడా అంటాడు. లేకపోతే ఏక్కుతున్నావా? అనవచ్చు.

నరే నాకిక అయనకూడా సినిమాకు వెళ్లక తప్పదు. మరి నా ఎంకి ఒంటరిగా ఆ చెఱువుగట్టున ఎంతసేపని నా కోసం కాసుకొని కూర్చుంటాది ? మంచి చిక్కే వచ్చింది! ఎలా? అనుకొన్నాడు ఇంటికి పోతూ.

ఒక ఆలోచన తలుక్కుమని మెరసింది అతని మెదడులో. యజమానికూడా సినీమాకు వెళ్ళినట్టే వెళ్లి ఆట మొదలుపెట్టాక అక్కడనుండి ఎంకి దగ్గరకు పోతాను. సినిమా వదలివేసేవేళకు మళ్ళీ అక్కడకు పోయి ఆయన్ని కలుసుకుంటాను అనుకొన్నాడు.

ఎంకడు పయనమై యజమానిని కలునుకున్నాడు. వారిద్దరూ శ్రీహనుమాన్‌థియేటర్‌కి బయలుదేరారు. యజమాని వెనుకాలేనడుస్తూ ఆయన చెప్పేవాటికి ఊకొడుతున్నాడు.

వీరు తొన్సిపూడిలాకును సమీపించారు 'లాకుడామ్' పుల్లుగా నీటితో రణగొణధ్వని చేస్తోంది పెద్ద అడావిడిగా!

"బాబూ నీరుపుల్ గావచ్చేసింది. మిగిలిపోయిన చేలకుకూడ రేపు నీరుపెట్టేస్తాను" అన్నాడు.

"అలాగే చేయి" అన్నాడు ఆనందబాబు.

పొలంఅంతా ఆయనది. అయితే పొలం మీదపడి నేలను శుభ్రంగా గోకి ధాన్యాన్ని గాదులలో నింపేవాడుమాత్రం ఎంకడు. ఇంత కష్టపడే ఎంకడికే కూలిగింజలు కొల్వటానికేడ్చే యజమాని ఆనందబాబు!

వారిద్దరూ థియేటర్‌ను సమీపించారు. "బాబూ ఉంగరం కరంటు దీపాలకాంతికి ఎర్రగా, పచ్చగా, తెల్లగా బలే కనబడుతుందండి!" అన్నాడు ఎంకడు. ఎందుకో అతనిదృష్టి ఉంగరపై పడింది.

"పొడి చాలా ఖరీదైనదిరా! ఉంగరం కొంచం వదులైంది బిగువు చేయించాలి" అన్నాడు ఆనందబాబు.

ఒక కుర్చీటికెట్, ఒక నేలటికెట్ తీసుకొని వారిద్దరూ సినీమాహాలులోకి ప్రవేశించారు.

ఎంకన్న సినీమాలో కూర్చున్నాడన్న మాటేకాని అతనిదృష్టి చెఱువుగట్టు ప్రియురాలు ఎంకివైపులకు మళ్లింది. వెంటనే అక్కడనుండి బయలుదేరి లాకుమీదకు వచ్చేడు.

"ఎవరూ? ఓరేయ్ ఎంకా! ఇలా రారా! బండి కాలవలోపడిపోయింది. మావాళ్లకు కాస్త సాయపడు" అన్నారు వెంకటరెడ్డిగారు. చేసేదిలేక ఎంకడు తోటివాళ్లకు సహకరించాడు.

గంటన్నరకి బయటపడ్డాడు ఎంకడు. ఎంత ఆలస్యం అయిపోయింది అనుకుంటూ త్వరితంగా బయల్దేరాడు ప్రియురాలి సన్నిధికి.

ఎంకడు సరస్సును సమీపించి ఎంకిని జూచి చాలా ఆశ్చర్యపడిపోయాడు—కొంత భయపడినాడుకూడా! ఎంకిమోము పూర్తిగా వాడిపోయింది. తన్నుజూచి ఆమె ముఖపద్మం ఎప్పుడూ వికసించి చిఱునవ్వులతో తన్ను కవ్వించేది. అలాంటి ఎంకి అందం, ఆనందం ఏమైనవా యిప్పుడు అనుకొని, చిఱుకంఠంతో 'ఎంకీ' అన్నాడు, పలుకలేదు సరిగదా తనవంకైనను చూడలేదు. "ఎంకే! నా ఎంకే!!" అన్నాడు మరింత ప్రేమగా. అయినా పలుకలేదు. ఎంకి కంట తడిపెట్టుకొంటోంది. నీటి బిందువులు చెక్కిళ్ళ మీదుగా జారుతున్నాయి.

"ఎంకే కంట తడిదేనికే! నేను అలస్యముగా వచ్చేనని కోపమా ? ఏం చెయ్యను ఈవేళ అన్నీ అడ్డంకులే! ఎప్పుడూ లేనిది ఈనాడు యజమాని సినిమాకు రమ్మన్నాడు. ఇక బాగుండదని ఆయనతో సినిమాకు వెళ్లినట్లే వెళ్ళి తప్పించుకొని వచ్చేసాను. మధ్యలో ఇంకోపనికూడా తగిలింది. ఐనా వాటి నేమీ లెక్కచేయకుండా రెక్కలు కట్టుకొని ఇక్కడ వాలేను. ఈ కొంచం అలస్యానికే ఇంత కోపమా నాపైన. దీనికే కంట తడిపెట్టుకోవాలా! ఇలా చూడు ఎంకి" అంటూ ఎంకడు ఎంకిమోమును తనవైపుకి తిప్పుకున్నాడు.

"ఎంకే ఎందుకే కన్నీరు? నే వచ్చేసాగా!" అన్నాడు ఎంకడు చాలా ప్రేమగా ఎంకిని ఊరడిస్తూ.

"అదికాదు ఎంకన్నబావా! నీ వెప్పుడు చూచినా యింతే! ఇప్పుడేమి జరిగిందో తెలుసా!" అంది చిఱుకోపంతో.

"ఏం జరిగిందేమిటి? ఏదోకొంపమునిగిపోయినట్లు చెప్తున్నావు!"

"ఎవడో నల్లటి ముసుగువేసుకొని వచ్చి దయ్యంలా నన్ను గట్టిగాపట్టుకొని బలాత్కరించబోయాడు. నేను అతికష్టంపై వాడి చేతులు గింజుకొని తప్పించుకొన్నాను. ఈ గట్టువారనే ఒక కర్ర కన్పించింది. దాన్నితీసుకొని వాడి నెత్తికడ్డంగాపెట్టికొట్టేసాను. ఇంతలోనే ఎవరో వస్తున్నట్లు అలజడయింది. ముసుగుమనిషి ఒక్కదెబ్బకే

క్రిందపడి గబ గబ లేచి పారిపోయాడు" అంది ఎంకి చిఱుదుఃఖకంఠంతో.

"నల్లవస్త్రాల ముసుగుమనిషా! ఎవడు వాడు! నిన్ను బలాత్కరించ ప్రయత్నించాడా! చాలా విచిత్రంగావుందే!"

"బావా! ఇక ఎన్నాళ్ళు? పెళ్ళిచేసేసుకుందాం బావా నాకు పెళ్లికాకపోతే ఇలాటి యిబ్బందులే వస్తాయి!"



"అలాగేలే ఎంకీ! నాకుమాత్రం ఎవరున్నారు. ఇంకా నీకేనయం తల్లిదండ్రులు లేకపోయినా అమ్మమ్మ, తమ్ముడు అంటూ వున్నారు. ఆ మూడు ముళ్ళు పడిపోయాక నీవు నాకు, నేను నీకు అనరాగానన్నా వుంటాము. హాయిగావుండొచ్చు!" అన్నాడు ఎంకడు ఎంకిని తన ఒళ్ళోకితీసుకుంటూ.

"ఎంకీ నేనిక వెళ్ళాలి మళ్ళా నేను సినిమాకడకుపోయి యజమానిని కలుసుకోవాలి. నేను సినిమాలో ఉన్నట్లే నటించాలి! సినిమా వదలివేసే వేళవుతుంది" అని ఎంకడు ఆమెదగ్గర్నుండి సెలవుతీసుకొని, నాలుగు అడుగులు వేసాడోలేదో కాని అతనికళ్ళు జిగేల్‌మన్నాయి. అతని కొక ఉంగరం దొరికింది. దాన్నిచూచి చాల అబ్బురపడినాడు. "ఇ....ది ఇ....ది మన యజమానిగారిదికాదు" అనుకొన్నాడు ననుకుతూ.

"కాదూ ఏమిటి? ఇది మీ యజమానిదే! దీన్ని ఇందాకను నీకు చూపించి 'కొంచం వదులుగావుంది బిగువు చేయించాలిరా' అన్నాడు జ్ఞాపకంలే!" అంది అతని అంతరాత్మ.

"అయితే ముసుగువేసుకొని వచ్చి నా ఎంకిని బలాత్కరించుటకు ప్రయత్నించినవాడు నా యజమానా! నాకే ద్రోహం తలపెడతాడా!! పాపి. అయినా ఎంకి ఇప్పుడు ఇక్కడ వుందని ఆయనకెలా తెలుసు? అనుకొన్నాడు ఎంకడు.

అరి అమాయకుడా! బుల్లికుట్టి నీకంటె ముందుగానే దొడ్లోకి వెళ్ళాడు. నీ వక్కడ వున్నావనుకొని. నీవు లేవు. ఆయన వున్నాడు వాడిని భయపెట్టో, ఆశపెట్టో ఆయన వాడిదగ్గర్నుంచి ఇది కాస్తా తెలుసుకొన్నాడన్నమాట అన్నది అంతరాత్మ!

ఎంకన్నకంతా అర్థమయింది, ఎంత అన్యాయాని కొడిగట్టేడు నా యజమాని! కసాయి!! పచ్చిరక్తం త్రాగే పిశాచి!!! వాడికేంతెలుసు నీతి? ధనగర్వం ధనం ఉన్నవాణ్ణి నాలాంటి దరిద్రుడేమి చేయగలడు? లేకపోతే పెద్దజమీందారు సత్యంగారు ఏంచేసారు. ఏదో కట్టిస్తామని ఊరుమ్మడ ఎకరానికింతని డబ్బు, ధాన్యం ప్రోగుచేసారు, ఏం కట్టించాడు? ఎవడు అడగ్గలిగేడాయన్ని? ఎవడికి దమ్ములున్నాయి! ఛ! వాళ్ళు ఏంచేసినా చెల్లుతుంది. నాలాంటి బక్కవాడు ఆకలిమంటకు తట్టుకోలేక చేయపనిలేనివాడొక చిన్న దొంగతనంచేస్తే కటకటాలవతల కూర్చొపెడతారు! ఛ! ఛ!!" అనుకున్నాడు ఎంకడు చాల విసుగ్గాను చిఱుకోపంగాను. ఇలాంటివాళ్ళు అలిగితే ఎంత? ఆనందించితే యెంత?

"బావా! ఎంకన్నబావా ఒక్క క్షణంలో ఇలా అయిపోయావేమిటి? ఏమిటి ఆలోచిస్తున్నావు? ఈ ఉంగరం యేమిటి? ఎవరిది?" అని ప్రశ్నలవర్షం కురిపించింది ఎంకి ఎంకనిపై.

"ఈ ఉంగరం మా యజమానిది. తరువాత చెప్తానులే అదంతా" అని అక్కనుండె బయలుదేరాడు థియేటర్‌కి.

సినీమా కబుర్లతోను, ఆడవాళ్లపై వాలుచూపుల పరంపరలతోను జనం కిటకిటలాడుతూ గుంపులు గుంపులుగా వచ్చేస్తున్నారు. యజమాని ఉంటానని చెప్పినచోట లేడు. వళ్ళంతా కళ్ళుచేసుకొని

కలయచూసాడు ఎంకడు. యెక్కడా కనిపించలేదు.

పాపం! ఎంకి గట్టిగా తలభిన్నంచేసింది గాబోలు! ఆ దెబ్బతో యింటికి పోయి వుంటాడు. సరే ఉదయాన కలుసుకుందామనుకొని ఎంకడింటికి పయనమయ్యాడు.

"ఏంబాబూ రాత్రి మీరు సినిమాపూర్తిగా చూడకుండావచ్చేసారా?" అన్నాడుఎంకడు ఆనందబాబు దర్శనం ఉదయాన దొరకగానే. "లేదురా ఉన్నట్లుండి కడుపునొప్పి తలబాధపట్టుకుంది. అంచేత నగంలోనే వచ్చేసాను. నీవుపోయి మిగిలిన చేలకు నీరు పెట్టేయ్ యీవేళ" అన్నాడు ఆనంద బాబు.

"బాబూ ఈ ఉంగరం తమరిదేనా?" అన్నాడు ఉంగరాన్ని చూపిస్తూ ఎంకడు. "అరెరె! అది నీకెక్కడిదిరా? నాదే రాత్రి ఎక్కడో పడిపోయింది. కొంచంవదులుగా వుంది బిగవచేయించాలి అన్నాను రాత్రి జ్ఞాపకంతే. నాదేరా ఇలాతే!" అన్నాడు అతృతగా ఆనందబాబు.

"ఇదిగో తీసుకొండి! రాత్రి చెరువు గట్టున దొరికింది. అంతా ఎంకి చెప్పింది లెండి!" అన్నాడు ఎంకడు ఉంగరం యజమానికందిస్తూ.

"అంతా ఎంకి చెప్పిందిలెండి" అనటంతోటే ఆనందబాబు నిశ్చేష్టుడయిపోయాడు. ఉంగరం చెఱువుగట్టున దొరికిందనటంతోటే అయన కొంచం కంగారుపడ్డాడు. ఎంకి నన్ను గుర్తుపట్టేసి వీడికి చెప్పివేసిందేమిటి చెప్మా! అయితే వీడూ రాత్రి సినిమాలో లేడన్నమాట! అనుకొన్నాడు ఆనందబాబు.

ఎంకడిముఖాన్ని, ఆ ఉంగరాన్నిచూచేటప్పటికి అయనకు కంగారు పుట్టుకొని వచ్చింది. అయన రాక్షస హృదయాన్ని బలంగా ఎవరో పొడిచినట్లయింది. ముచ్చెమటలుపోసాయి, తల తిరిగింది, కాళ్లాడలేదు. శిలాప్రతిమలా నిలబడిపోయాడు!

★

# అసలు సంగతి

రచన : రామవరపు గణేశ్వరరావు

ఒకప్పుడు స్త్రీలందరూ కలసి ఆలోచించారు. దీర్ఘంగా ఆలోచించారు. తాము పురుషుల జీవనరథానికి రెండు చక్రాల్లాటివారు. ఉభయులూ సమాన సుఖం అనుభవిస్తున్నారు. అలాగే సమానకష్టం ఎందుకు అనుభవించకూడదు? తాము నవమాసాలు మోయాలి. ఈ నవమాసాలూ నరకయాతన అనుభవించాలి. తరువాత ప్రసవవేదన! ఇది మరీ ఘోరం! నరకయాతనకి మించినబాధ. తమలో కొందరు ఈసమయంలో మరణించడం కూడా కద్దు. ఈ కష్టాల్లో పురుషులు భాగం పంచుకోరు. ఎందుకు పంచుకోకూడదు! తమతో సమానసుఖం అనుభవిస్తున్నవారు ఆ వచ్చే కష్టాలని కూడా సమానంగా అనుభవించాలి. ఇదీ వారికొచ్చిన సమస్య.

ఆదేశపురాణి కొంతమంది స్త్రీలు కలసి భగవంతుని ప్రార్థించి ప్రసన్నుని జేసుకున్నారు. భగవంతుడు దయామయుడు. వారి కోరిక విన్నాడు. అనుగ్రహించాడు. "పిల్లల్ని కనేది మీరైనా ప్రసవవేదన మాత్రం పురుషులికనుంచే అనుభవిస్తారు" అని అంతర్ధానమయ్యాడు. అనాడు ఆడవాళ్లందరూ అవధిలేని ఆనందసాగరంలో ఆటుకున్నారు.

మొట్టమొదట రాణీగారి వంతు వచ్చింది. నవమాసాలు దగ్గరపడినై. ఇంక రాజుగారికి భయముపట్టుకుంది. రాజు తన హంసతూలికా తల్పంబుపై మేనువాల్చాడు. చుట్టూవైద్యులు, కాదు కాదు వైద్యశిఖామణులు పరివేష్టించారు రాజుగారి బాధ నివారించడానికి. ఆ మందిరంలో ఒక పెద్దగంట ఏర్పాటు చేసారు. రాణీగారు ప్రసవించిన వెంటనే ఆ గంట మ్రోగేటట్లు కూడా ఏర్పాటుచేసారు. రాజు మానసికబాధ వర్ణనాతీతం. ఎలాగుంటయో నొప్పులు? కడుపునొప్పిపెడుతుందేమో! తలనొప్పి పెడుతుందేమో! క్షణ క్షణానికి తనవళ్లు తడుముకొని బాధపడుతున్నాడు. గుండెలు గుబగుబలాడుతుంటే చిక్కపట్టుకొని కూర్చున్నాడు. ఇంతలో గంటమ్రోగింది. ఓహో! రాణీగారికి సుఖం ప్రసవం కాబోలు అని అనుకున్నాడు రాజుగారికి వీసమెత్తు బాధ లేకుండగనే రాణీగారు ప్రసవించారు.

రాణీగారు హాయిగా, సుఖంగా పడుక్కొని అప్పుడే ప్రసవించిన శిశువుని చూస్తూ ఆనందిస్తున్నారు. ఇంతలో చెలికత్తె పరుగెత్తుకొని వచ్చింది. "అమ్మా! అమ్మా! మన గుర్రపుబండీ తోలే గుర్రయ్య చాలా బాధపడుతున్నాడమ్మా ఇందాకటనుంచీ! కడుపుపట్టుకొని పొర్లిపొర్లి యేడుస్తున్నాడు. అవస్థలు పడుతున్నాడు. మన రాజవైద్యులకి చూపిద్దామా?" అని అడిగింది ఇంతి. రాణీగారికి చటుక్కున తెలివివచ్చింది. ఏదో ఏదో జ్ఞాపకమొచ్చింది. తన మెడలోని రత్నాల హారాన్ని దాసిపై విసరింది. "ఇదుగో! ఇంతే! గుర్రయ్యను ఎవ్వరికీ తెలియకుండా వాడి యింటికి తీసుకవెళ్ళు. ఇప్పుడు నాతో చెప్పిన విషయాన్ని ఇంకెవరికి తెలియనీయక వెళ్ళు! ఇంతి రత్నహారాన్నికళ్లకద్దుకుంటూకదిలింది.

రాణీ, తదితరస్త్రీలు తమసమస్యను తిరిగి చర్చించారు. భగవంతునిదగ్గరకు బయలుదేరాడు. "మహాప్రభూ! సుఖంలాగే కష్టంకూడ ఒక ఉదాత్తమైన అనుభూతి అని గ్రహించాం. కష్టానికి ఉన్న విలువ తెలుసుకున్నాం. కష్టంలేని ప్రసవం మాకొద్దు ఇకనుంచీ మునుపటిలాగే మేమే ప్రసవ వేదన అనుభవించేటట్లు అనుగ్రహించండి స్వామీ!" అని ప్రార్థించారు.

భగవంతుడు భక్తవత్సలుడు కాదంటూడా?

"అలాగే!" అని అంతర్ధానమయ్యాడు.

★